686) లలిత

ప॥ ఇవ్వల వెదకితేనే యేమి లేదు । అవ్వలికి దాటి మీరు అందుకోరో శుభము ॥

చ॥ కను రెప్పలతుదల గట్టువలె గాలము । ఘనమై చేతులతుద గర్మమున్నది ।
మనసుకొట్టగొననే మరి దైవమున్నాడు । చెనకి యిక నెన్నడు సేయరో పుణ్యములు ॥

చ॥ కనకము దాటితేనే ఘనసుఖమున్నది । వెనక చీకటికొన వెలుగున్నది ।
వనితలఅవ్వలనే వరవిజ్ఞాన మున్నది । పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు ॥

చ॥ కాయముకొట్టగొననే ఘనవైకుంఠమున్నది । బాయట శ్రీవేంకటపతి వున్నాడు ।
మాయలకొనలనెల్లా మనము నున్నారము । పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు ॥